సాక్షి చిత్తూరు

బుధవారం । 28 । మే । 2025



ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలి

ఆర్టీసీలో ఖర్చులు తగ్గించి లాభాలు తీసుకువచ్చే బాధ్యత ఉద్యోగులపై ఉందని ఆర్టీసీ ఎండీ తెలిపారు. - 8లో



డీడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య దురుసు ప్రవర్తనపై డీఎస్సీ అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో



చెక్‌డ్యామ్‌కు గండి కొట్టిన ఘనుడు

పలమనేరు మండలం మొరం పంచాయతీలో కౌండిన్యనదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఓ రైతు గండి కొట్టాడు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి 'గురుకుల'ంలో అడ్మిషన్లు



మూర్తి, గిరిజన సంక్షే శాఖ అధికారి

కుప్పం : రామకుప్పం మండలం విజలాపురంలోని గురుకుల గిరిజన బాలుర పాఠశాలను గిరిజన బాలికల స్కూలుగా మార్పు చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారతశాఖ అధికారి ఎస్. మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి పాఠశాలలో బాలికల అడ్మిషన్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. 3 నుంచి 8వ తరగతి బాలికలకు ప్రవేశం కల్పించనున్నట్లు వివరించారు. కేవలం కుప్పం నియోజకవర్గమే కాకుండా జిల్లా వ్యాప్తంగా గిరిజన బాలికలకు ఈ పాఠశాలలో అడ్మిషన్‌కు అవకాశమిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9502806425 నంబర్‌లో హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరబాబును సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



చెక్ అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ..మృతి చెందిన కుటుంబాలకు చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మార్చి 31వ తేదీన హెడ్ కానిస్టేబుల్ కుబేంద్ర మృతి చెందారు. ఇందుకు గాను మృతుడి భార్య వాణికి రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కు ఇచ్చారు. అలాగే చిత్తూరులో పనిచేస్తూ ఫిబ్రవరి 2వ తేదీన శ్యామల కుమారి మృతి చెందారు. మృతురాలి కుమారుడు ప్రశాంత్‌కు రూ.లక్ష చెక్కును అందజేసి వారికి భరోసా ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే సహించం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్‌ఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే సహించే ప్రసక్తే లేదని డీఎంహెచ్‌ఓ సుధారాణి హెచ్చరించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేసే అధికారం ఆర్‌ఎంపీలకు లేదని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేసినా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

యోగాతో శక్తి.. ప్రశాంతత



యోగాసనాలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

కాణిపాకం : యోగాతో శక్తి, ప్రశాంతత సిద్ధిస్తుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆరోగ్యవంతం జీవనానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో యోగా మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ క్రమంలో కాణిపాకం, పులిగుండు, బోయకొండ, కంగుంది ప్రాంతాల్లో యోగ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా యోగాసనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం యోగాసనాలు వేశారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్‌డీఓ భవానీ, డీఎంహెచ్‌ఓ సుధారాణి, దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక సంజీవని..

చిత్తూరు కలెక్టరేట్ : యోగా వ్యాధి నిరోధక సంజీవని అని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల వద్ద యోగా మందిరంలో నిర్వహిస్తున్న మాస్టర్ ట్రైనర్స్ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నేటితో మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. శరీరాన్ని మనస్సుతో సంయోగం చేసే ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రక్రియ యోగా అని వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ బాలాజీ, జీసీడీఓ ఇంద్రాణి, ఆయుష్ వైద్యులు ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

నాడు-నేడు కింద తీర్చిదిద్దిన పాఠశాల



పల్లె కన్నీరుపెడుతోంది. నిర్వీర్యమైన సచివాలయాలను చూసి బావురుమంటోంది. కడుపులో చల్ల కదలకుండా సకల సేవలు పొందేవారు మండల కేంద్రాలకు పరుగులు పెడుతుంటే ఆవేదన చెందుతోంది. అలంకారప్రాయంగా మారిన రైతుభరోసా కేంద్రాలను గమనించి కుమిలిపోతోంది. అన్నదాత అవస్థలను చూడలేక.. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. పనిచేయని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వెక్కిరిస్తుంటే.. రోగుల బాధలను భరించలేక మూగగా రోదిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అద్భుతంగా నిర్మించిన భవనాలను దిష్టిబొమ్మల్లా కూటమి సర్కార్ మార్చేస్తుంటే.. ఇదేం పరిపాలన అంటూ ప్రశ్నిస్తోంది. మంచి వారిని వదిలేసి.. ముంచేవారినే గ్రామీణులు నమ్మారని నిట్టూరుస్తోంది. పేదల బడిలో అత్యాధిక వసతులు కల్పించిన సంక్షేమ పాలకులను కాదని.. పేదలకు కొమ్ముకాసే వారిని తెచ్చుకున్నారని కుమిలిపోతోంది.
– చిత్తూరు కలెక్టరేట్/ చిత్తూరు రూరల్



యాదమరి మండలం కాశిరాళ్లలో అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనం

చౌడేపల్లె మండలం కొండామర్రి గ్రామ సచివాలయం, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఆర్‌బీకేని రైతు సేవాకేంద్రంగా మార్చిన దృశ్యం





సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

నాడు పరిఢవిల్లె..
నేడు పల్లె కుమిలె

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెలిగిన గ్రామాలు
- సకల సేవలకు సచివాలయాలు
- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలు
- అన్నదాతకు అండగా రైతుభరోసా కేంద్రాలు
- అందుబాటులో విలేజ్ క్లినిక్‌లు
- ప్రస్తుత కూటమి పాలనలో పడకేసిన పల్లె ప్రగతి
- అసంపూర్తిగా భవనాలు
- అలంకారప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- నిర్వీర్యమైన సచివాలయాలు
- బాబు తత్వం బోధపడి కన్నీరు పెడుతున్న గ్రామీణులు



● ఏడాది క్రితం వరకూ ఓ వెలుగు వెలిగిన రైతు భరోసా కేంద్రాలలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు మార్చేసింది. వాటి పనితీరును అస్తవ్యస్తం చేసేసింది. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం 30 సాన్నేగానిపల్లె ఆర్‌బీకే పరిధిలో సాన్నేగానిపల్లె, నాయనపల్లె, కూతేగానిపల్లె, బాబూనగర్, కేపీ మిట్ట, సంతూరు, గొల్లపల్లె, వెంకటేష్‌పురం గ్రామాల రైతులు ఉన్నారు. గత ఏడాది మే 20 నుంచి జూన్ 2వ తేదీ వరకూ ఈ ఆర్‌బీకేలో వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు. అయితే ఈ ఏడాది ఇప్పటికీ ఆ ఊసే లేదు. కనీసం ఒక్క ఎరువుల బస్తా కూడా రాలేదు. సిబ్బందిని కూడా రైతులకు అందుబాటులో లేకుండా కూటమి ప్రభుత్వం చేసేసింది. మంగళవారం ఉదయం ఆర్ఎస్‌కేకు వచ్చిన ఇన్‌చార్జి సైతం కార్యాలయంలో మీటింగ్ ఉందని వెళ్లిపోయాడు. దీంతో రోజంతా కేంద్రం మూతపడి ఉంది. ఇదే తంతు ఏడాదిగా జరుగుతుండడంతో ఇక్కడి వచ్చే రైతుల సంఖ్య కూడా తగ్గిపోయింది.





2023 మే 21న సాన్నేగానిపల్లె ఆర్‌బీకేలో వేరుశనగ విత్తనాల పంపిణీ (ఫైల్), ఈ నెల 27వ తేదీకి కూడా విత్తనాలు రాక మూతపడిన రైతు సేవా కేంద్రం



ఆర్‌ఎస్‌కే వద్ద భాస్కర్ రెడ్డి

● ఇతడి పేరు భాస్కర్ రెడ్డి, విజయపురం మండలం, కళియంబాకం గ్రామం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈయనకు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే ఎరువులు, క్రిమిసంహారక మందులు, యూరియా అన్నీ అందేవి. ప్రస్తుతం ఎరువుల కోసం నానా యాతన పడుతున్నాడు. గతంలో రూ.270 తెచ్చుకునే ఎరువులను నేడు 15 కిలోమీటర్లు ప్రయాణించి ఎస్ఎస్ కండ్రిగకు వెళ్లి రూ.300లకు కొంటున్నాడు. ట్రాన్స్‌పోర్టుకు రూ.30 అదనంగా ఖర్చవడంతో పాటు ఎరువుల కొనుగోలు కంటూ సగం రోజు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆరు నెలలుగా ఎరువులకోసం రైతు సేవా కేంద్రంలో అడుగుతున్నా ఎలాంటి స్పందన లేదని ఆరోపిస్తున్నాడు. తూతూ మంత్రంగా జనుము మాత్రం పంపిణీ చేశారని వాపోయాడు. తమ బాధలు ఎవరితో చెప్పుకోవాలో తెలియని దుస్థితి కూటమి ప్రభుత్వంలో దాపురించిందని వాపోతున్నాడు.



రైతు మనోహర్‌రెడ్డి

● ఇతడి పేరు మనోహర్ రెడ్డి, గుడిపాల మండలం మరకాలకుప్పం గ్రామం. ఏటా రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తాడు. అదే విధంగా ఈ పర్యాయం కూడా సాగుకు సన్నద్ధమయ్యాడు. అయితే ఇప్పటి వరకు రైతు సేవాకేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయలేదు. అడిగితే సిబ్బంది తమకు తెలియదంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన చెందుతున్నాడు. దుక్కులతో పొలం సిద్ధం చేసుకున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మే 15వ తేదీకే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేవారని గుర్తుచేసుకుంటున్నాడు. కూటమి పాలనలో విత్తనాల ఊసేలేదని ఆరోపిస్తున్నాడు. వ్యవసాయశాఖ అధికారులకే వేరుశనగ విత్తనాల పంపిణీపై ఓ క్లారిటీ లేదని అసహనం వ్యక్తం చేస్తున్నాడు. సీజన్ పూర్తయి, అదును తప్పిన తర్వాత విత్తనాలు ఇస్తారేమో అని ఆందోళన చెందుతున్నాడు.

జిల్లా సమాచారం

మొత్తం పంచాయతీలు :	697
రెవెన్యూ గ్రామాలు :	822
గ్రామీణ జనాభా :	15.04 లక్షలు
కుటుంబాలు :	4,65,970
గ్రామ సచివాలయాలు :	504
ఉద్యోగులు :	5,040
గతంలో పనిచేసిన వలంటీర్లు :	7,728
రూరల్ లోని కుటుంబాలు :	4,65,970

గ్రామీణ ప్రాంతాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి

కేటగిరీ	భవనాల సంఖ్య	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
గ్రామ సచివాలయాలు	504	19,354.73
రైతుభరోసా కేంద్రాలు	506	11,030.80
వైఎస్సార్ ఆరోగ్యకేంద్రాలు	351	6,142.50
పాలశీతలీకరణ కేంద్రాలు	13	229.71
డిజిటల్ గ్రంథాలయాలు	184	7,952.00
రూరల్‌రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్ట్	474	50,884.35
మొత్తం	2,052	95,594.09

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వర్ణయుగం

మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆవిష్కరించింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి సరికొత్త చరిత్రకు నాంది పలికింది. గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. గ్రామ సచివాలయాలు రావడంతో సామాన్య గ్రామీణుడికి సైతం ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్ల పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు 700లకు పైగా సేవలను గ్రామీణుల గడప వద్దకే చేర్చారు. వలంటీర్ల ద్వారా పల్లెవాసుల కష్టనష్టాలకు ఆసరాగా నిలిచారు. శిథిలావస్థలోని సర్కారు బడులకు ప్రాణం పోశారు. కార్పొరేట్ హంగులతో నిరుపేద పిల్లలకు ఉత్తమ విద్యను అందించారు. రోగం వస్తే దూరాభారం వెళ్లాల్సిన పనిలేకుండా సొంత ఊరిలోనే వైద్యం చేయించుకునేందుకు విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద ఇంటింటికీ వైద్యసేవలు తీసుకువచ్చారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలిచారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటికే చేర్చారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సాగును సంబరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేశారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించారు. గ్రామాల్లో పాలశీతలీకరణ కేంద్రాలే ఏర్పాటు చేశారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించారు. పశువులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే దాదాపు ప్రతి పల్లెలో మూడు నుంచి నాలుగు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. సీసీ రోడ్లు వేయించారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనించాయి. పల్లెసీమలు కళకళలాడాయి.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు



కళకళలాడుతున్న సచివాలయం

కూటమి పాలనలో సర్వం.. నిర్వీర్యం



మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్



అసంపూర్తిగా పాఠశాల భవనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణులను గాలికి వదిలేసింది. కుట్రపూరితంగా వ్యవహరిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన చక్కటి కార్యక్రమాలకు సైతం తిలోదకాలిచ్చింది. ప్రజలకు ఉపయోగపడే వాటిని నిర్వీర్యం చేసింది. అందులో భాగంగానే సచివాలయ వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించింది. విలేజ్ క్లినిక్‌ల లక్ష్యాలను నీరుగార్చింది. కనీస మాత్రం మందులు కూడా లేకుండా చేసి పల్లెవాసుల ఆరోగ్యంతో ఆటలాడుకుంది. ఇంటింటికీ వైద్యసేవలను తూతూమంత్రంగా మార్చేసింది.

ఆర్‌బీకేలకు రైతు సేవా కేంద్రాలుగా మార్చి.. అన్నదాతలకు అసలు సేవలే అందకుండా దుర్బుద్ధిని చాటుకుంది. పంటల సాగులో కనీసం సలహాలు అందించేందుకు కూడా వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో లేకుండా చేసింది. నాడు–నేడు కింద అక్కడక్కడ అసంపూర్తిగా ఉన్న బడులను నిర్దయగా వదిలేసింది. పేద బిడ్డల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేందుకు తెగబడింది.



ఐరాల మండలంలో వెలవెలబోతున్న సచివాలయం

విత్తనాల ఊసే లేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వేరుశనగ విత్తనం,రాగులు, ఉలవలు రాయితీతో ఇచ్చేవారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఇంత వరకు విత్తనాల ఊసే లేదు.ఎటువంటి సేవలైనా రైతుభరోసా కేంద్రాల్లో పొందేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అన్నదాత సుఖీభవ అన్నారు ఇంతవరకు పైసా విదల్చలేదు.
– వెంకటేష్, పెద్దతయ్యూరు , ఎస్‌ఆర్‌పురం మండలం

గతంలోనే బాగుండేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సేవలు బాగుండేవి. నాలాంటి వృద్ధులకు వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్‌లను అన్యాయంగా నిలిపివేశారు. ఆ బిడ్డలు మమ్మల్ని బాగా చూసుకునే వాళ్లు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి గ్రామాలకు మేలు చేయాలి.
– ఆదెమ్మ, పాలసముద్రం.

తల్లికి వందనం ఏమైందో..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత నిచ్చారు. గ్రామాల్లోని సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడుల అభివృద్ధికి చేసిందేమీ లేకపోయినా జరుగుతున్న నాడు–నేడు పనులను ఆపివేసింది. ఇక తల్లికి వందన అన్నారు.. అది ఏమైందో తెలియదు.
– శ్రీనివాసరావ్, విద్యార్థి తండ్రి, ఐరాల మండలం.

ఎలాంటి మేలు కలగలేదు



కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి మేలు కలగలేదు. ఎన్నికల సమయంలో రైతులకు ఏదేదో చేస్తామని హామీలు గుప్పించారు. ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక రైతులకు వెన్నుపోటు పొడిచారు. రైతు భరోసా కేంద్రాల్లో గతంలో చాలా సేవలందించేవారు. ప్రస్తుతం అవి నిర్వీర్యం అయిపోయాయి.ముందు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలి.
– ప్రభాకర్, రైతు, ఐరాల మండలం

నిరుపయోగంగా మారాయి



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రం ఎప్పుడు తెరుస్తారో కూడా తెలియడం లేదు. ఉన్న వ్యవసాయ, పశువైద్య సహాయకులను ఇతర పనులకు పంపుతున్నారు. పెన్షన్లు ఇచ్చేది వాళ్లే. ప్రభుత్వం చెప్పే సర్వేలు చేసేది వాళ్లే. ఆ పనుల్లో ఎక్కడో ఉంటే వాళ్లను కలవలేక పోతున్నాం. ఇప్పటి వరకు వేరుశనగ విత్తనాలు కూడా ఇవ్వలేదు.
– జి.రమేష్‌రెడ్డి, రైతు కూతేగౌనిపల్లె, శాంతిపురం మండలం.

గతంలో బడులు మెరుగుపడ్డాయి



నాడు–నేడు పథకంతో సర్కారు బడులు మెరుగుపడ్డాయి. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. కూటమి పాలనలో కార్పొరేట్‌కే ప్రోత్సాహం దక్కుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకునేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బడుల్లో నాడు–నేడు పనులు నిలిపివేయడం అన్యాయం.
– నరేంద్ర, విద్యార్థి తండ్రి, కొత్తపల్లె, గంగవరం మండలం



క్లుప్తంగా

డీడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- కలెక్టరేట్ వద్ద డీఎస్సీ అభ్యర్థుల నిరసన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య దురుసు వ్యవహార శైలిపై కుట్టి శిక్షణ కేంద్రం డీఎస్సీ అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అభ్యర్థులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిసి ఆవేదనను చెప్పుకున్నారు. శిక్షణ కేంద్రంపై ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. డీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అవుతున్న సమయంలో తమ ఏకాగ్రత దెబ్బతినేలా అధికారి వ్యవహరించడం ఎంత వరకు న్యాయమన్నారు. నిరసన కార్యక్రమంలో కుట్టి శిక్షణ కేంద్రం డైరెక్టర్ పవనకుమారి, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లను పరిశీలన చేస్తున్న హెచ్‌ఎంలు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రేడ్–2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 150 ఖాళీలకు గ్రేడ్–2 హెచ్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వర రావు పరిశీలించారు.

సెలవులో జాయింట్ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : వ్యక్తిగత పనుల నిమిత్తం జాయింట్ కలెక్టర్ విద్యాధరి సెలవుపై వెళ్లారు. 27 నుంచి 29 వ తేదీ వరకు అందుబాటులో ఉండరు. జేసీగా కలెక్టరే అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. తిరిగి 30న జేసీ విధులకు హాజరవుతారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

చిత్తూరు అర్బన్ : ఆలయంలో హుండీ పగులగొట్టి చోరీ చేసిన ఘటనలో రామ్మోహన్ (35) అనే నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం మంగళవారం తీర్పు ఇచ్చింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డి.ఉమాదేవి కథనం మేరకు... బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె పంచాయతీ పాపుదేసివారికండిగ గ్రామంలోని వినాయకస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు 2023 మార్చి 31న రాత్రి ఆలయ హుండీని పగులగొట్టి.. అందులో ఉన్న రూ.2 వేలు అపహరించుకుని వెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తనిఖీ చేపట్టి నిందితుడు అనంతపురం జిల్లా కదిరికి చెందిన రామ్మోహన్ (35)గా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ విషయం వెలుగులోకి రావడంతో నిందితుడిపై బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.


మామిడి కాయల ప్యాకింగ్‌లో వ్యాపారులు

మామిడల్

- పడిపోయిన మామిడి ధరలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం కట్టమంచిలోని మామిడి కాయల మార్కెట్ మంగళవారం బోసిపోయింది. వారం రోజులుగా మార్కెట్‌కు టేబుల్‌రకాలు 15 టన్నుల వరకు వచ్చేవి. మంగళవారం కేవలం 4 టన్నుల బేనీషా కాయలు మాత్రమే వచ్చాయని ట్రేడర్లు చెబుతున్నారు. పడిపోయిన మామిడి ధరల కారణంగా రైతులు కోతలను నిలిపేశారు. రేట్లు వచ్చిన తర్వాత అమ్ముకుందామని కోతకు బ్రేక్ వేశారు. ఎక్కువగా బెంగుళూరు, చెన్నైలో ఉన్నవారికి విక్రయాలు చేసుకుంటున్నారు. బల్క్ బుకింగ్ చేసుకుని వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బేనీషా కిలో రూ.15, చందూర రూ.4 నుంచి రూ.5, అల్ఫోన్సో రూ.25, తోతాపూరి (టేబుల్‌రకం) రూ. 10 వరకు పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

చెక్‌డ్యాంకు గండికొట్టిన ఘనుడు

- నీళ్లు వృథాగా పోతున్నాయని రైతుల ఆవేదన

పలమనేరు : కౌండిన్య నదిలో నిర్మించిన చెక్‌డ్యాం కారణంగా తన పొలంలో ఎక్కువగా నీరు నిలుస్తోందని ఓ రైతు ఏకంగా చెక్‌డ్యాంకే గండికొట్టిన సంఘటన మండలంలోని మొరం పంచాయతీలో మంగళవారం చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్యలోని పలు చెక్‌డ్యామ్‌ల్లో నీరు చేరింది. అయితే ఈ నీటినిల్వతో తన పొలంలో నీటి ఊట వస్తోందని తొప్పనపల్లికి చెందిన బాబు అనే వ్యక్తి చెక్‌డ్యామ్ కింద గండిని కొట్టాడు. దీంతో నీరు వృథాగా పోవడంపై అక్కడి రైతులు అతన్ని వారించినా పట్టించుకోలేదు. దీంతో స్థానిక సర్పంచ్ విశ్వనాథ రెడ్డి ద్వారా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన స్థానిక ఇరిగేషన్ డీఈ భోక్లానాయక్ తమ సిబ్బందితో కలిసి గండి పడిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించి ఇసుక బస్తాలతో నింపాలని అక్కడి రైతులకు సూచించారు. ఇందుకు కారణమైన వ్యక్తిని పిలిపించి వారించగా అతను తాను టీడీపీకి చెందిన వాన్నని ఏమైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడుకోవాలని చెప్పడంతో డీఈ సైతం వెనుదిరగాల్సి వచ్చింది.


చెక్ డ్యామ్ నుంచి వృథాగా పోతున్న నీరు

జూన్‌లో పొలంబడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జూన్ నెల మొదటి వారం నుంచి జిల్లాలో పొలంబడి ప్రారంభమవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 27 పొలంబడుల నిర్వహణే లక్ష్యం అన్నారు. మెరుగైన ఉత్పత్తులతో పాటు వాటి అమ్మకాలకు సహకరించేలా చూడడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షలు చేసి...వాటికి అనుగుణంగా పొలంబడికి ఎంపిక చేసిన రైతుల ద్వారా పంటలు పండించేలా చేస్తామన్నారు. పురుగుమందు వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులు పాటించేలా చేస్తామన్నారు. పంట పండించడం నుంచి దిగుబడి అయ్యే వరకు దగ్గరుండి పర్యవేక్షిస్తామన్నారు. తద్వారా వచ్చిన ఫలాలను జిల్లాలోని 16 ఎఫ్‌పీఓ కేంద్రాల ద్వారా విక్రయానికి పెట్టుకునేలా చూస్తామని పేర్కొన్నారు.

యాప్ ట్రాప్


మైక్రో ఫైనాన్స్ అప్పులతో ఆత్మహత్య చేసుకున్న తలారి మోహన్



రుణం అడగకుండానే లోన్‌యాప్ నిర్వాహకులు మొబైల్ ఫోన్‌కు సంక్షిప్త సందేశాలు పంపిస్తుంటారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారు తరువాత ఎదురయ్యే పరిణామాలు తెలియక సులువుగా రుణం పొందవచ్చనే ఆశతో వెనకా ముందు ఆలోచించకుండా లోన్ యాప్ ఉచ్చుకు చిక్కి ఉసురు తీసుకుంటున్నారు. ఇచ్చిన రుణానికి నాలుగు , అయిదింతలు వడ్డీ వేసి ఎక్కువ డిమాండ్ చేస్తారు. అడిగినంత చెల్లించకపోతే ఫోన్ నుంచి తీసుకున్న కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి , కాంటాక్ట్ నంబర్లలో ఉన్న బంధువులు, మిత్రులకు పంపించి వేధిస్తారు. బాధితులు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడి అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్నారు. ఇదే కోవలోనే పలమనేరు మండలంలో రుణ యాప్స్ ఓ వ్యక్తిని బలి తీసుకుంది.

- ఆగని లోన్‌యాప్ ఆగడాలు
- జనాల రక్తం తాగుతున్న లోన్‌యాప్స్
- భారీగా వడ్డీతో లూటీ చేస్తున్న వైనం
- సకాలంలో అప్పు చెల్లించకుంటే నగ్న ఫొటోలతో బెదిరింపులు
- ఎవరికీ చెప్పుకోలేక ఆవేదన చెందుతున్న బాధితులు

పలమనేరు : రకరకాల లోన్ యాప్స్ అధిక వడ్డీలతో ప్రజలకు అప్పులిచ్చి ఆపై వారు సక్రమంగా చెల్లించకపోతే వారికి నరకం చూపెడుతున్నాయి. ఆర్థిక సమస్యలున్నవారు స్మార్ట్‌ఫోన్‌లో వచ్చే పలు రకాల లోన్ యాప్స్‌ను చూసి ఆశపడి వీటిని పొందుతున్నారు. వీటిలో వారం, నెల, ఏడాది రుణాలున్నాయి. రుణాలు పొందాక సకాలంలో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించకపోతే ఆపై వీరి ఆగడాలు తప్పడం లేదు. దీంతో పాటు మైక్రోఫైనాన్స్ సంస్థలు కేవలం ఆధార్ కార్డు ఆధారంగా ఇళ్లను రాయించుకొని లక్షల్లో అధిక వడ్డీలకు రుణాలిస్తున్నారు. అధిక వడ్డీలతో కంతులు చెల్లించలేక పలువురు ఇబ్బందులు పడుతున్నారు. పలమనేరు మండలంలోని మాదిగబండకు చెందిన తలారి మోహన్ (43) అనే వ్యక్తి మంగళవారం పొలం వద్ద తండ్రి సమాధి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఎలా రుణాలిస్తున్నారంటే ?

రకరకాల లోన్ యాప్స్ ద్వారా రూ.10 వేల నుంచి లక్షల దాకా రుణం పొందాలంటే డబ్బు తీసుకున్న వారి ఆధార్, కుటుంబీకుల ఆధార్, వారి ఫోన్ నంబర్లు తీసుకుంటారు. ఆపై ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ తదితరాలు పట్టుకొని మన ఖాతాలోకి పంపుతున్నారు. అయితే రూ.5 వడ్డీతో అసలు కలిపి ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాల్సి ఉంటుంది. అప్పు తీసుకునే వారి స్తోమతను, సిబిల్ రేటింగ్స్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.50 లక్షల దాకా రుణాలను ఇట్టే అందిస్తున్నారు.

ఎంత చెల్లించినా అప్పు తీరదు

అధిక వడ్డీతో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించాల్సి రావడం , ఓ కంతు కట్టకుంటే దానికి జరిమానా కలిపి భారీగా పెరగడం తదితరాలతో అప్పు తీరడం కష్టంగా మారుతుంది. మొదట్లో ఇదంతా చాలా సులభంగా ఉంటుందని నిర్వాహకులు నమ్మించి ఆపై అసలు కథను నడిపిస్తారు. దీంతో తీసుకున్న లోన్‌కు అసలు, వడ్డీ కలిపి తీర్చినా ఇంకా ఉందంటూ బెదిరింపులు తప్పవు. కట్టకుంటే మీ కుటుంబీకుల న్యూడ్ ఫొటోలను వైరల్ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతారు.

ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు

- ఇటీవల తిరుపతికి చెందిన రాజు(30) లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- తిరుపతికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెంగళూరులో ఉంటూ అక్కడ లోన్ యాప్స్‌లో రు.లక్షల్లో రుణాలు పొంది వడ్డీ ఎక్కువై దాన్ని చెల్లించలేక తిరుపతికి వచ్చి బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- పలమనేరులోని ఓ యువకుడి బెదిరింపులు తప్పలేదు. దీంతో అప్పు చేసి మరీ డబ్బు చెల్లించినా ఇంకా అప్పు ఉందని బెదిరించారు. దీంతో అతను కట్టకపోవడంతో వారి కుటుంబలోని మహిళల న్యూడ్ ఫొటోలని కాంటాక్టులోని నంబర్లకు పంపించారు. దీంతో ఈ విషయం స్థానిక పోలీసుల వరకు వెళ్లింది.
- ఇలాంటి ఘటనలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వందల్లో జరిగినా వెలుగు చూస్తున్నవి కొన్ని మాత్రమే.

బ్లాక్ మెయిల్ చేస్తూ..

డబ్బులు సకాలంలో చెల్లించకుంటే డబ్బు తీసుకున్న వారి వాట్సాప్, కుటుంబీకుల వాట్సాప్‌కు వారి ఆధార్ ఆధారంగా ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి నగ్న ఫొటోలను సెండ్ చేస్తున్నారు. అప్పటికీ కట్టకుండా ఉంటే వారి వాట్సాప్‌ను హ్యాక్ చేసి వారి నంబర్లకు సైతం న్యూడ్ ఫొటోలను పంపుతున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలోని పలువురికి ఇదే విధమైన పరిస్థితి వస్తే వారు అప్పు చేసి మరీ మొత్తం అప్పును చెల్లించేశారు. డబ్బు కట్టకుంటే కుటుంబీకుల నగ్న ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామంటూ బెదిరింపులు తప్పడంలేదు. ఈ మొత్తం వ్యవహారం కేవలం యాప్ ద్వారానే సాగుతున్నందున ఎవరిపై ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక బాధితులు కుమిలిపోతున్నారు. అయితే ఇలాంటి లోన్ యాప్‌ల జోలికెళ్లరాదని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తూనే ఉన్నా జనం మాత్రం అప్పులు చేసి చెల్లించ లేక ఇబ్బందులు పడుతున్నారు.

గుట్టుగా దేవదాయ శాఖ కార్యాలయ నిర్మాణం ?

- సంతపేటలో ఫంక్షన్ హాల్ పేరుతో భవన నిర్మాణం


సంతపేటలో నిర్మిస్తున్న భవనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం సంతపేటలో జరుగుతున్న ఓ నూతన భవనం వివాదాస్పదంగా మారుతోంది. ప్రస్తుతం జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయం జీవకారుణ సత్రంలో కొనసాగుతోంది. కొన్నేళ్ల కిందట ఈ కార్యాలయ నూతన నిర్మాణానికి వడ్లమండి సత్రం భూమిలో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే అక్కడ అడ్డంకులు రావడంతో ఆ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక జీవకారుణ్య సత్రంలోని కార్యాలయాన్ని మార్చేందుకు ఓ అధికారి లోలోపల ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫంక్షన్ హాల్ పేరుతో సంతపేటలో ఓ భవన నిర్మాణ పనులు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనికి సంబంధించి టెండర్లు, ప్రకటనలు ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణ పనులు చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ భవనం నిర్మాణం పేరుకు ఫంక్షన్ హాల్ అయినా ప్లానింగ్ మొత్తం శాఖ కార్యాలయంగానే జరుగుతున్నాయని పలువురు వాదనకు దిగుతున్నారు. ఆ స్థలంలో ఫంక్షన్ హాల్ మాత్రం ఉండాలని...ఇతర వాటికి అనుమతులిస్తే అడ్డుకుంటామని స్థానికులు చెబుతున్నారు.

స్టాంప్ పేపర్స్.. నోస్టాక్


కార్యాలయంలో నోస్టాక్ అని పెట్టిన పోస్టర్

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలనందు స్టాంప్ పేపర్స్ కొరత ఏర్పడింది. గతవారం చివరిలో జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్స్ మొత్తం 40 వేలు అందించారు. వీటిని వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది సోమవారం అమావాస్య, మంగళవారం పాడ్యమి అని కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇక సిబ్బంది బుధవారం ఆ పేపర్స్‌ను సీల్ వేసి వాటిని ఆన్‌లైన్ చేసి ఎప్పుడు ప్రింట్ తీసి ఇస్తారోనని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

తపాలా ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోండి

చిత్తూరు కార్పొరేషన్ : తపాలా ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోవాలని ఆశాఖ సీనియర్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల నగదు, పలు రకాల నష్ట పరిహారాలు పొందాలంటే ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి అన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధిదారుల ఖాతాకు జమ కావాలంటే ఎన్‌పీసీఎల్ కింద ఆధార్‌తో అను సంధానం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంత వరకు వీటిని చేసుకోని ఖాతాదారులు సమీప తపాలా కార్యాలయం లేదా సచివాలయంలో సంప్రదించాలన్నారు. కార్యాలయానికి రావడానికి వీలుపడని వారు తపాలాశాఖలో సంప్రదిస్తే సిబ్బందిని పంపుతామని వివరించారు.

మత్స్యకారులకు బోట్లు, వలలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని మత్స్యకారులకు వలలు, బోట్లు ఇచ్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పీఎం మత్స్య సంపద యోజన కింద జిల్లాలోని మత్స్య కారులకు వలలు , బోట్లు ఇవ్వనున్నారు. జిల్లాలో 20 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 47 చెరువుల్లో 3.30 లక్షల చేపలు అందజేశారు. తాజాగా సొసైటీల్లోని మత్స్యకారుల్లో వంద మందికి చేపలు పట్టే వలలు, మరో వంద మందికి బోట్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాగానే వీటిని అందజేయనున్నట్లు మత్స్యశాఖాధికారులు తెలిపారు.

ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలి

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు


ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

పలమనేరు : ఆర్టీసీలో ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచే బాధ్యత ఉద్యోగులపై ఉందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. పలమనేరు డిపోలో మంగళవారం జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. పలమనేరు బస్టాండు, డిపోలను ఆయన పరిశీలించారు. అనంతరం డిపో వద్ద మొక్కలను నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. డిపోలోని 11 మంది ఆదర్శ ఉద్యోగులకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వలే మీరు కార్మికులు కాదని ఉద్యోగులేనని గుర్తుంచుకోవాలన్నారు. సీఎస్‌పీ, ప్రమాదబీమా, ఆర్‌పీఎస్‌లు సెటిల్ చేశామన్నారు. ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ పెండింగ్ బకాయిలను త్వరలో ఇస్తామన్నారు. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చే బాధ్యతను మీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బస్సులో ప్రయాణికులకు మర్యాదనివ్వడం చాలా ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో స్థానిక డీఎం టీకే స్వామి, వివిధ కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు.



డబుల్ మేజర్.. అంతా బేజార్!

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు తయారైంది.. డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టుల పరిస్థితి. ఈ ఏడాది నుంచి రెండు మేజర్ సబ్జెక్టులు ఎంచుకుని విద్యార్థులు చదువుకునే వీలు కల్పించినా.. అందుకు తగ్గ విధంగా అధ్యాపకుల కొరతపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలయ్యేలోపైనా దీనిపై చర్చించి సమస్య పరిష్కరిస్తారో.. లేదా అలాగే వదిలేస్తారో వేచి చూడాలి మరి.

ఈ ఏడాది నుంచి డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టులు

- కరిక్యులమ్ రూపకల్పన పూర్తి చేసిన ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ
- వీసీలు, నిపుణులతో చర్చించి నిర్ణయించిన ఉన్నత విద్యామండలి
- ఏఐ, మిషన్‌లర్నింగ్ కోర్సులతో సరికొత్త డిగ్రీలు
- అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల సంగతేమిటో?
- జిల్లాలో ఓఏఎమ్‌డీసీ నోటిఫికేషన్ కోసం 30 వేల మంది ఎదురుచూపు


ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

తిరుపతి సిటీ: విద్యారంగంలో నూతన సంస్కరణల్లో భాగంగా డిగ్రీలో ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నారు. ఇదివరకు ఉన్న సింగిల్ మేజర్ సబ్జెక్టుతో పాటు మరో మేజర్ సబ్జెక్ట్‌ను విద్యార్థులు అభ్యసించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కరిక్యులమ్ రూపకల్పన కోసం నియమించిన రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ నివేదిక సమర్పించింది. ఈ ఏడాది విడుదలయే ఓఎమ్‌డీసీ నోటిఫికేషన్‌లో డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని వర్సిటీల వీసీలతో, నిపుణులతోనూ సమావేశమై తుది నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఉన్న మల్టీడిసిప్లీనరీ విధానంలో మూడు సబ్జెక్టులు మేజర్‌గా ఉండేవి. 2023–24లో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో డిగ్రీ పూర్తి చేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు రెండు మేజర్ సబ్జెక్ట్‌లను విద్యార్థి చదవాల్సిందేనంటూ సరికొత్త విధానాన్ని అములు చేయబోతున్నారు.

ఏఐ, మిషన్‌లర్నింగ్ కోర్సులతో సరికొత్త డిగ్రీలు

డబుల్ మేజర్ సబ్జెక్ విధానంలో డిగ్రీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. మేజర్ సబ్జెక్టులకు అనుసంధానంగా మైనర్ సబ్జెక్టులుగా క్వాంటమ్ కంప్యూటింగ్, మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టులను చేర్చేందుకు కసరత్తు పూర్తిచేశారు. దీంతో బీటెక్ సాంకేతిక విద్యనభ్యసించే వారికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ సబ్జెక్టలను డిగ్రీ చదివే విద్యార్థులు మైనర్ సబ్జెక్టలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉండనుంది.

ఎదురుచూపులు

ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలై సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రి ప్రవేశాల కోసం వెలువడే ఓఏఎమ్‌డీసీ (ఆన్‌లైన్ అడ్మిషన్స్ టు డిగ్రీ కాలేజస్) నోటిఫికేషన్ విడుదల చేయలేదు. నోటిఫికేషన్ కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. కానీ డబుల్ మేజర్ సబ్జెక్ట్ అంటూ విద్యార్థులను కన్‌ఫ్యూజన్‌లోకి నెడుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో పలువురు విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్, పలు కంప్యూటర్ డిగ్రీ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు.

ఎస్వీయూ పరిధిలో డిగ్రీ కళాశాలల సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
టీటీడీ కళాశాలలు	5
ప్రైవేటు కళాశాలలు	104
సింగిల్ మేజర్ సబ్జెక్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు	25 వేల మంది
డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు	30 వేల మంది

అధ్యాపకుల కొరత మాటేమిటో?

ప్రభుత్వం డిగ్రీ విద్య విషయంలో గందరగోళం సృష్టిస్తోంది. డబుల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెడుతూ నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్న ఉన్నత విద్యామండలి అసలు విషయం బోధన సిబ్బంది కొరతపై ఆలోచించకపోవడం గమనార్హం. అన్ని ఉన్నా.. అల్లుడునోట్లో శని అనే చందంగా తయారైంది కూటమి ప్రభుత్వ పాలన. డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు, ల్యాబ్ సౌకర్యాలు, అధ్యాపకుల కొరతతో జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలు సతమతమవుతున్నాయి. ఇప్పటికే పలు కళాశాలల్లో మేజర్ సబ్జెక్టులకు శాశ్వత అధ్యాపకులు కొరతతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా డబుల్ మేజర్ అంటూ ఊదరగొడితే నష్టపోయేది విద్యార్థులే.

డబుల్ మేజర్ అంటే..

డబుల్ మేజర్ సబ్జెక్టులు అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాన మేజర్ సబ్జెక్ట్‌కు 48 క్రెడిట్లు, రెండో మేజర్ సబ్జెక్ట్‌కు 32 క్రెడిట్లు ఇవ్వనున్నారు. ఎంపిక చేసుకున్న మేజర్ సబ్జెక్టలలో ఏదో ఒకదానిలో పీజీ చేసుకునే అవకాశం ఉంటుంది. మరో మైనర్ సబ్జెక్ట్‌గా విద్యార్థులకు ఇష్టమైన సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు బీఎస్సీ ఎంపీసీలో విద్యార్థి తనకు నచ్చిన మ్యాథ్స్, ఫిజిక్స్‌ను రెండు మేజర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకోవచ్చు. మూడవ సబ్జెక్ట్‌గా ఏదేని మైనర్ సబ్జెక్ట్‌ను ఎంపికచేసుకుని అభ్యసించవచ్చు. నూతన విద్యా విధానంలో భాగంగా 2020–21 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ ప్రస్తుతం అమలులో ఉంది. కానీ విద్యార్థులు మూడేళ్ల డిగ్రీపైనే మొగ్గు చూపుతున్నారు.

ఉపాధి అవకాశాలు మెండు



ఉన్నత విద్యామండలి ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ సబ్జెక్ట్‌లను డిగ్రీలో ప్రవేశపెట్టడం ఆహ్వానిస్తున్నాం. విద్యార్థి రెండు మేజర్ సబ్జెక్టులలో పట్టు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చు. ఇప్పటికే అందరి వీసీలు, విద్యారంగ నిపుణులతో చర్చించి నిర్ణయించారు. ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ కరిక్యులమ్ రూపకల్పన పూర్తి చేసిందని చెప్పారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఓఏఎమ్‌డీసీ నోటిఫికేషన్ త్వరలో విడుదలవుతుంది.

–సీహెచ్.అప్పారావు, వీసీ, ఎస్వీయూ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

FLAT FOR SALE
Tirupati Near Vaikuntapuram Arch L.C.Residency 1st Floor, 106, South Face, 1055 Sft, Fully Wood Work, 95427 06554, 73964 78833.

PLOT FOR SALE
చంద్రగిరి టౌన్‌లో, తుడా అనుమతి పొందిన స్వర్ణముఖి నగర్‌లో 2736 చదరపు అడుగుల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర: 7200471656.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ద్వారా మీ పాఠకులు కోరిన సమాచారం, వారితో ఈ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PERSONAL CARE

CHANGE OF NAME
I, Hitherto Known as P Hussen Alias Palagiri Hussen S/o. Palagiri Basha Residing At 19-14-170, Raghavendra Nagar 6th Cross, Near Vivekananda Statue, Tirupathi, Tirupati (Rural), Chittor, Andhra Pradesh 517501, Have Changed My Name and Shall Hereafter Be Known as Palagiri Hussain for All Future Purposes

Wanted
Experienced Marketing Executives for car loans male Salary + Incentives Tirupati Location. Cell: 9030100111

కన్సల్టెన్సీ కారు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ప్రీరూం+భోజనం.Hyd 8317512135

హైదరాబాద్ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640256899, 9640468899

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970